క్లుప్తంగా

రూ.20 వేల విరాళం



చెక్కును అందజేస్తున్న వెంకటేశులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎండోమెంట్ బహుమతిని అందజేసేందుకు రూ.20,000 విరాళంగా అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో పని చేస్తున్న ఆంగ్ల అధ్యాపకుడు ఎస్వీ రమేశ్‌కుమార్ తన తల్లిదండ్రులు వి.విజయలక్ష్మి, ఎస్.వెంకటేశులు పేర్ల మీద ఈ ఎండోమెంట్ బహుమతిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏటా ఆంగ్ల సబ్జెక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి రూ.20,000పై వచ్చే వడ్డీని బహుమతిగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నగదు చెక్కును ఎస్.వెంకటేశులు చేతుల మీదగా ప్రిన్సిపల్‌కు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలవరపు ఇండ్లలో రీబోరు

పాకాల : మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ పోలవరపు ఇండ్లలో నీటి సమస్యను తీర్చేందుకు గురువారం స్థానిక సర్పంచ్ గౌరీశంకర్‌రాజు ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో రీబోరు వేశారు. వేసవి కాలం రాక ముందే గ్రామంలో నీటి సమస్య తలెత్తడంతో స్థానికులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రీబోర్ వేసినట్లు తెలిపారు.

వినూత్నరీతిలో సేవా కార్యక్రమాలు



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఏటీఎం, కంట్రోలర్ చెంగల్‌రాయల్

తిరుపతి అర్బన్: తిరుపతి డిపోలో కేఎస్ చెంగల్‌రాయల్ కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. ఆయన శుక్రవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. 34ఏళ్లపాటు ఆర్టీసీలో ఉద్యోగం చేసిన ఆయన ఉద్యోగ విరమణ సభను వద్దని భావించారు. అయితే అందుకు ఆయనకు అయ్యే ఖర్చు నగదుతో ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేస్తున్న 62 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను గురువారం పంపిణీ చేశారు. మహిళలకు చీరలు, పురుషులు ప్యాంట్, షర్టులు అందజేశారు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

పాకాల : మండలంలోని దామలచెరువులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బుధవారం రాత్రి మహాశివరాత్రి సందర్భంగా గౌరీ బోర్‌వెల్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 15 జట్లు పాల్గొన్నాయి. పుంగనూరు జట్టు గెలుపొంది రూ.15 వేలుతో పాటు ట్రోఫీని కై వసం చేసుకుంది. దామలచెరువు జట్టుకు రెండవ స్థానంలో నిలువగా రూ.7 వేలు నగదు బహుమతిని గురువారం ఉదయం బోర్‌వెల్స్ ప్రతినిధులు, ఎస్‌ఐ సంజీవరాయుడు, చేతుల మీదుగా అందజేశారు.

ఫిట్‌నెస్, పర్మిట్ లేకుంటే సీజ్



మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి

తిరుపతి మంగళం : తిరుపతి జిల్లా పరిధిలో ఆటోల సంఖ్య విపరీతంగా పెరిగిందని, అయితే వాటికి ఫిట్‌నెస్, పర్మిట్ సర్టిఫికెట్లు లేకుంటే సీజ్ చేస్తామని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. మంగళంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో గురువారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో అనేక ఆటోలకు ఫిట్‌నెస్, పర్మిట్ లేకుండా, ఓవర్ లోడుతో నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. ఇకపై రవాణాశాఖ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. మోటారు వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికా నాజ్, స్వర్ణలత, పరిపాలనా అధికారి విజయ ప్రశాంతి, ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ శివ పాల్గొన్నారు.

తపాలా బీమా..
ఉన్నత చదువులకు ధీమా

తపాలా శాఖ ప్రజలకు, విద్యార్థులకు, ఉద్యోగులకు సేవలందించేందుకు అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) పథకాన్ని ఈనెల ఒకటో తారీఖు నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభించింది. గతంలో ఈ పథకం కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తించేది. ప్రస్తుతం డిగ్రీ పట్టభద్రులకు వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలవాలనే ప్రధాన ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది.

- డిగ్రీ పట్టా పొందిన విద్యార్థులకు సువర్ణ అవకాశం
- ఉద్యోగుల కుటుంబానికి భరోసా కల్పిస్తున్న పీఎల్ఐ బీమా
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

తిరుపతి సిటీ: కేంద్రప్రభుత్వం తపాలా జీవిత బీమా పథకం 1884 ఫిబ్రవరి ఒకటో తారీఖున దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు భరోసా ఇచ్చేందుకు ప్రవేశపెట్టింది. తిరుపతి డివిజన్ పరిధిలో ఈ పథకంలో వేలమంది ఉద్యోగులు చేరి లబ్ధి పొందారు. ఎంతో ప్రాచుర్యం పొందిన ఈ పథకాన్ని విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో పట్టభద్రులకు అవకాశం కల్పిస్తూ పీఎల్ఐ దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి ఒకటో తారీఖు నుంచి అవకాశం కల్పించింది.



పీఎల్ఐ పాలసీ లోగో

డిగ్రీ పట్టా ఉంటే చాలు.. అర్హులే..

డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరూ పీఎల్ఐ పథకానికి అర్హులు. బీటెక్, ఎంటెక్ బీఈడీ, ఎంఈడీ, బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంబీబీఎస్, బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్, బీ పార్మసీ వంటి కోర్సులతో పాటు అన్ని విభాగాల్లో యూజీ, పీజీ కోర్సులు చేసిన విద్యార్థులు ఈ పాలసీకి అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. వీరితో పాటు 19 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు గల పట్టాదారులు, ఉద్యోగులు ఈ పాలసీలో చేరేందుకు అర్హులు.

పీఎల్ఐ ప్రయోజనాలు ఇవీ..

- పాలసీ అంగీకరించిన తేదీ నుంచి పూర్తి జీవిత బీమా సౌకర్యం
- ప్రీమియాన్ని దేశవ్యాప్తంగా ఏ పోస్టాఫీసులోనైనా చెల్లించే వెసులుబాటు
- ఐపీపీబీ, పోస్ట్ ఇన్ఫో యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం
- ల్యాప్స్(చెల్లని) పాలసీలను నిబంధనల ప్రకారం అధికారులను సంప్రదించి పునరుద్ధరించుకోవచ్చు
- ఒక ఏడాది ప్రీమియం ముందే చెల్లించిన వారికి 2 శాతం రిబేటు సౌకర్యం
- ఒక్కో వ్యక్తి రూ.50 లక్షల వరకు ఎన్ని పాలసీలైనా తీసుకోవచ్చు
- ఆదాయపు పన్ను మినహాయింపు
- ఇతర బీమా పాలసీల కంటే ప్రీమియం తక్కువ, బోనస్ అధికం పొందే అవకాశం
- పాలసీదారుడు మరణిస్తే పాలసీ విలువతో పాటు అప్పటివరకు జమైన బోనస్‌ను కుటుంబ సభ్యులకు చెల్లిస్తారు.

పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల బంగారు భవితకు పీఎల్ఐ ఎంతో ఉపయోగకరం. పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అన్ని పోస్టాఫీసులలో పాలసీ చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం, పాలసీ వివరాలు, ప్రయోజనాల కోసం పోస్టల్ అధికారులను సంప్రదించాలి. పీఎల్ఐ స్కీమ్ గురించి మరింత మందికి అవగాహన కల్పించి భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నాం.
– నరసప్ప, పోస్టల్ సూపరింటెండెంట్, తిరుపతి

మాజీ సర్పంచ్‌కు నివాళి



సిద్ధముని యాదవ్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సిద్ధముని యాదవ్(72) గురువారం ఉదయం అగ్రహారంలోని తన నివాసంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ గ్రామానికి చేరుకుని సిద్ధముని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్ధముని యాదవ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మధ్య సిద్ధముని అంత్యక్రియలు పూర్తి చేశారు.

చిన్నారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: ముండ్లపూడిలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శివుడిని కీర్తిస్తూ పాటలు, నృత్యాలు ప్రదర్శించి భక్తులను అలరింపజేసిన చిన్నారి కళాకారులను గురువారం జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఆలయంలో బుధ, గురువారం రెండు రోజుల పాటు శివరాత్రి తిరుణాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల దొడ్డారెడ్డి మనోహర్‌రెడ్డి, తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, ముళ్లపూడి సర్పంచ్ సూరి, ఉపసర్పంచ్ అప్పిరెడ్డి, గుండాల గోపినాథ్‌రెడ్డి కళాకారులను సత్కరించారు.

ఘనంగా సిద్ధ పూజ



విశేషాలంకరణలో శ్రీ సిద్ధేశ్వరస్వామి, అమ్మవారు



తలకోనలో జరిగిన సిద్ధపూజ కార్యక్రమం

తలకోన(భాకరాపేట): తలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్ధపూజను ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం శ్రీసిద్ధేశ్వర స్వామి, అమ్మవార్లకు కలశ జలాభిషేకం చేసి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం ఆలయంలో సిద్ధపూజకు జంగం దేవర్లు కొత్త కుండల్లో సిద్ధ ప్రసాదాన్ని సిద్ధం చేశారు. ముందుగా సిద్ధేశ్వరి సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామి వార్లను సిద్ధపూజకు ఆహ్వానించారు. అలాగే మిరాశీదార్లు స్వామి, అమ్మవార్లను, గ్రామ దేవతలను, ముక్కోటి దేవతలను సిద్ధపూజకు ఆహ్వానించారు. అనంతరం సిద్ధుల చేత ప్రసాదాన్ని పంపిణీ చేశారు.


సంతానం ఇవ్వు స్వామీ

సంతానం కోసం ఈ ఏడాది 108 మంది మహిళలు వరపడ్డారు. వీరందరికీ సిద్ధుల చేత ప్రసాదం పంపిణీ చేశారు.

సిద్ధ ప్రసాదం సిద్ధం

సిద్ధ ప్రసాదాన్ని 170 పళ్లాల్లో అన్ని శాఖల అధికారులు, అర్చకులు, మీరాశీదార్లు, మండల స్థాయి ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఆలయ ఈఓ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ నియంత్రణ



క్యాన్సర్ నివారణ, స్క్రీనింగ్ పరీక్షల ఆవశ్యకతపై సూచనలు అందిస్తున్న ప్రొఫసర్ డాక్టర్ హైమావతి

తిరుపతి రూరల్ : స్క్రీనింగ్ పరీక్షలు చేసుకుని తగిన వైద్య సేవలు పొందితే క్యాన్సర్ నుంచి బయటపడొచ్చని శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయ అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హైమావతి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లి, కొప్పరవాండ్లపల్లిలో గురువారం శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్, టాటా ట్రస్టు సంయుక్తంగా క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు, దాని వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం పలువురు మహిళలకు ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్లపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్యాన్సర్ కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వెంకయ్య బాబు, ప్రోగ్రాం మేనేజర్ హేమంత్, డీఈవో మహేంద్ర, అధ్యయన కేంద్రం ప్రాజెక్టు అసిస్టెంట్స్ ఇంద్రాణి పాల్గొన్నారు.

స్టూడెంట్ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న పీడీఎస్ఓ సభ్యులు, అతిథులు

తిరుపతి సిటీ: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్ఓ) ఆధ్వర్యంలో ఎమరాల్డ్స్ కళాశాల వేదికగా పాలస్తీనా సంఘీభావ సభపై ప్రత్యేక సంచిక ఆవిష్కరణ జరిగింది. పీడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఆషా ఆధ్యక్షతన జరిగిన సభకు కార్మిక నాయకులు ఎస్.మీరయ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పాలస్తీనా జాతిహననమే లక్ష్యంగా ఇజ్రాయెల్ 15 నెలల పాటు సాగించిన యుద్ధంలో 45 వేలకు పైగా పాలస్తీనియన్లు మరణించడంతో పాటు పాలస్తీనీయులను ఆ దేశం నుంచి తరిమేసి, అక్కడి వనరులను దోచుకోవడం కోసం అమెరికా సాగిస్తున్న చర్యలను, 78 ఏళ్లుగా ఇజ్రాయెల్ –పాలస్తీనా మధ్య జరుగుతున్న వివాదం గురించి రూపొందించిన "స్టూడెంట్ ప్రత్యేక సంచిక"ను అందరూ చదవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోవిందులు, పీడీఎస్ఓ జిల్లా కన్వీనర్ ప్రవంతి, కమిటీ సభ్యులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక



నగర అధ్యక్షుడు సురేష్,



నగర ప్రధాన కార్యదర్శి వెంకటేష్

తిరుపతి కల్చరల్: ఆటో వర్కర్స్ యూనియన్ నగర శాఖ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ నగర మహాసభ ముగింపు సందర్భంగా ఈ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఎస్.శివ, గౌరవ సలహాదారుడిగా ఎన్‌డీ రవి, అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా సతీష్, ఉపాధ్యక్షులుగా కుమార్, భాస్కర్, కృష్ణ, ప్రమీల, సహాయ కార్యదర్శులతో పాటు 15 మంది కమిటీ సభ్యులు నియమితులయ్యారు.

నిరాశ్రయులకు వైద్యసేవలు



నిరాశ్రయులకు పరీక్షలు నిర్వహిస్తున్న రష్ ఆస్పత్రి సిబ్బంది

తిరుపతి సిటీ: నగరంలోని మెప్మా, హోప్ ఫౌండేషన్, రష్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పట్నూలవీధిలోని నిరాశ్రయుల కేంద్రంలో గురువారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. నిరాశ్రయులకు బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రష్ ఆస్పత్రి ఎండీ, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కమిషనర్ మౌర్య, హోప్ ఫౌండేషన్ యాజమాని గల్లా కవిత, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పురుషామృగ వాహనంపై కపిలేశ్వరుడు



పురుషామృగ వాహనంలో కొలువై భక్తులను కటాక్షిస్తున్న శ్రీకామాక్షి అమ్మవారి సమేత కపిలేశ్వరస్వామి



కల్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు గురువారం ఉదయం సర్వాంగసుందర అలంకారప్రియులై శ్రీకామాక్షి సమేత శ్రీసోమస్కందమూర్తి పురుషామృగ వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి పురుషామృగవాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు కదులుతుండగా, కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ స్వామివారి పురుషామృగ వాహన సేవ కోలాహలంగా నిర్వహించారు. అర్ధరాత్రి 12 నుంచి ఉదయం 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకం వేడుకగా నిర్వహించారు. తిరిగి రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి తిరుచ్చి వాహనంపై కొలువై శ్రీకపిలేశ్వరస్వామి శ్రీకామాక్షి అమ్మవారి సమేతంగా పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం నాడు ఉదయం త్రిశూల స్నానం, రాత్రి ధ్వజావరోహణం, రావణాసుర వాహన సేవ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవం.. కపిలేశ్వరుడి కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన గురువారం సాయంత్రం శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపానికి శ్రీకపిలేశ్వరస్వామి, శ్రీకామాక్షి అమ్మవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణివాసన్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చకులు భక్తులు శివ నామస్మరణ చేస్తుండగా కల్యాణాన్ని నిర్వహించారు.

నేడు త్రిశూల స్నానం

శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం త్రిశూలస్నానం వేడుకగా నిర్వహించనున్నారు. ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు శ్రీనటరాజస్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ దర్శనమివ్వనున్నారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు త్రిశూల స్నానం ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కాగా సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల మధ్య చేపట్టే ధ్వజావరోహణంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కాగా రాత్రి 8 గంటల నుంచి 10 వరకు రావణాసుర వాహన సేవ జరుగనుంది.

తిరుపతి రూరల్‌లో..

తిరుపతి రూరల్: తుమ్మలగుంట సమీపంలోని ఎల్ఎస్ నగర్ వద్ద ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో గురువారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త చెంగారెడ్డి ఆలయ చైర్మన్ ఉమాపతిరెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ లీలా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. అగస్త్యేశ్వరుడి కల్యాణం



పుట్టాలమ్మ ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



తొండవాడ అగస్త్యేశ్వరస్వామివారి ఆలయ ఆవరణలో ఆది దంపతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: మండల పరిధిలోని తొండవాడ స్వర్ణముఖీ నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదిదంపతులకు గురువారం సాయంత్రం శాస్త్రోక్తంగా కల్యాణ్యాన్ని నిర్వహించారు. తెల్లవారు జామున 12.30 గంటలకు లింగోద్భవ అభిషేకం, సాయంత్రం కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

కాంచిన కనులదే భాగ్యం

స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులో వెలసిన శ్రీశ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం(పుట్టాలమ్మ)లో తెల్లవారుజామున లింగోద్భవ అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కూల్ క్యా(మ్యా)న్..



గత వారం రోజులుగా తిరుపతి నగరంలో ఎండలు మండిపోతున్నాయి. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో కార్యాలయాలు, దుకాణాదారులు తమ వద్దకు వచ్చే వినియోగదారులకు వేసవిలో చల్లటి నీటిని అందించేందుకు మొగ్గు చూపుతారు. అందులో భాగంగా ఓ వ్యక్తి కూల్ వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి బైక్‌లో తీవ్ర ఎండలో తీసుకెళ్తుండగా గురువారం సాక్షి కెమెరా ఈ దృశ్యాన్ని క్లిక్ మనిపించింది
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నేడు సామాజిక తనిఖీ

చంద్రగిరి: ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. మండల ప్రజాప్రతినిధులు, ఉపాధిహామీ కూలీలు, అధికారులు హాజరుకావాలని ఆ ప్రకటనలో కోరారు.